# ఏకాకృతి

మాదిరాజు రంగారావు

మంచు ముసుగు వేసుకున్న మనిషి
నా కనుచూపుమేర చివర ఆగి
నావైపు అడుగులు సాగించడం మాని
ఆలోచనా మూర్తిలా అక్కడే నిల్చిపోతే

నా కాలి సవ్వడి నాకే భయంగా
నా ఊహ పడగవిప్పినపాములా
నగ్నంగా వాంఛాసహితంగా కన్పించి
నా ఆకృతి నాకే రెండురంగులుగా

ముఖం త్రిప్పి చూతును గదా వెనుక
మలిసంజ రెక్కనీడవలె నిలువునా
నేత్రగోళాలనావరించిన నైల్యాకృతి
అప్పటినుండి ఎటుచూచిన ఏకాకృతి

గగన చక్షుస్సంయోగానుభూతి ఎరుగని
సృష్టి విదాపూర్వ నిరామయ జలాకృతి

దగ్గరిగా దూరదూరంగా కాలినడకల
సన్నని సవ్వడి వినిపిస్తూంది ఇప్పటివరకు

చిరుకదలికలో తాటిమొవ్వల ముర్మరము
నవ్వుతెర లేదా ఏడుపురొద ఏమైనా కావచ్చు
కళ్ళలో సూదులు గ్రుచ్చి అంధుని చేసి

ఆనందించే పిల్లలు! ఎంత మంచివాళ్ళు!
వీరు బ్రతికినంతకాలం ఇలాగే వుంటె

బిందువులో నీరులా; ఆనందాశ్రువులలో
దుఃఖానికి పర్యాయపదం భగవంతుడౌతాడా?

నాకు కన్పించినది భగవంతుడని చెబితే
వాళ్ళను వదలివేసాననుకొని అమాయకంగా
ఎవడికి వాడు మనసులో సంతోషిస్తాడనుకుంటా